ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విజయనగరం

జిల్లా వార్తలు

మంగళవారం 6 మే 2025

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు: ఇన్‌చార్జి కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్,మే 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12 నుంచి 20 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఇన్‌చార్జి కలెక్టర్ సేతుమాధవన్ సోమవారం తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 8.30 నుంచి 12 గంటలు వరకూ, రెండో సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరంలో 15,000 మంది, రెండో సంవత్సరానికి సంబంధించి 6000 మంది పరీక్షకు హాజరు కానున్నారని, మొత్తం 78 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



నిధులున్నాయి.. రోడ్లే లేవు!

- నిర్మాణాలకు క్షేత్రస్థాయిలో అడ్డంకులు
- అటవీశాఖ అభ్యంతరాలతో సాగని వైనం
- గిరిజన గ్రామాల ప్రజలకు తప్పని ఇక్కట్లు
- ఎస్.కోట మండలంలో తప్పని డోలీ మోతలు

అవి కొండశిఖర గ్రామాలు. రోడ్డు సౌకర్యం కూడా లేదు. వారు పడుతున్న ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. అత్యవసరమైతే డోలీ కట్టాల్సిందే. క్షేమంగా ఇంటికొచ్చే వరకూ అనుమానమే. ఆసుపత్రిలో ఎవరైనా చనిపోతే.. మృతదేహాలను భుజంపై ఊరికి చేర్చాల్సిన దుస్థితి. ప్రజాప్రతినిధులేమో ఈ గ్రామాల రోడ్లకు నిధులు మంజూరు చేయించారు. ఆ తర్వాత ఆ పనులు ఎంతవరకు వచ్చాయోనని పట్టించుకోవడం లేదు. అటవీశాఖ అభ్యంతరం చెబుతోందని పీఆర్ అధికారులు చెబుతున్నారు. వీరేమో చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయరు. దీంతో ఈ కష్టాలు ఎన్నేళ్లు పడాలని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- రేగ పుణ్యగిరి గిరిశిఖర గ్రామానికి చెందిన ఫాంగి సీతమ్మకు ఈనెల 1న పురిటి నొప్పులు వచ్చాయి. ఈ గ్రామానికి రోడ్డు సదుపాయం లేదు. దీంతో భర్త నర్సింగరావు తోటి గిరిజనులతో కలిసి డోలీ కట్టి నాలుగు కిలోమీటర్ల దిగువన ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకుని వెళ్తుండగా మార్గమధ్యంలోనే సీతమ్మ కాన్పు అయి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పచ్చి బాలింతను, శిశువును పుణ్యగిరి కొండ కింద భాగాన ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దకు తీసుకుని వచ్చారు. అక్కడి నుంచి 108 వాహనంలో ఆసుపత్రిలో చేర్చారు.

- ఏప్రిల్ నెల 7న చిట్టంపాడుకు చెందిన సోముల బోడమ్మకు పురిటి నొప్పులు రావడంతో గిరిజనులు డోలీ కట్టారు. పది కిలోమీటర్ల దూరం మోసుకుని వచ్చారు. మైదాన ప్రాంతానికి వచ్చిన తరువాత 108 వాహనంలో ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. డోలీలో ఉన్నంతసేపు బోడమ్మ పడిన వేదనను చూసి బంధువులంతా తల్లడిల్లి పోయారు.

శృంగవరపుకోట, మే 5(ఆంధ్రజ్యోతి): దబ్బగుంట నుంచి పల్లపు దుంగాడ గిరిజన గ్రామానికి 6.10 కి.మీ. రోడ్డుతో పాటు 34 కల్వర్టుల నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం నుంచి ప్రభుత్వం రూ.489.08 లక్షలు కేటాయించింది. 2021 జూన్ 21న పనులు ప్రారంభం అయ్యాయి. 2022 జూన్ 20 నాటికి పూర్తి కావాలి. ఇప్పటికీ ఈరోడ్డు నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. అటవీశాఖ అనుమతుల్లేవని ఆపేశారు. అటవీశాఖ నుంచి పొందిన భూమికి బదులు పేదఖండేపల్లి గ్రామపరిధిలో భూమిని కూడా అధికారులు అప్పగించారు. అయినా అటవీశాఖ అభ్యంతరం చెబుతోందని పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు. నాలుగు సంవత్సరాలుగా ఈ రోడ్డు సాగుతూనే ఉంది. శృంగవరపుకోట మండలంలోని గిరిశిఖర గ్రామాల రోడ్లకు నిధులు విడుదలైనా.. నిర్మాణానికి అడుగడుగునా అడ్డంకులే. అటవీశాఖ అనుమతులు ఇవ్వడం లేదంటూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు చెబుతున్నారు. దీంతో అత్యవసరమైతే గిరిశిఖర గ్రామాల ప్రజలకు డోలీ కష్టాలు తప్పడం లేదు. పురిటి నొప్పులతో ఆసుపత్రికి వెళ్లే వెళ్లే గర్భిణి.. బిడ్డతో కలిసి ఇంటికి వచ్చేవరకు అనుమానమే. అనారోగ్యంతో మంచానపడ్డ గిరిజనుడిని ఆసుపత్రికి తీసుకెళ్లే వరకూ ఆందోళనే. చివరకు చనిపోయిన వారిని ఊరికి తీసుకెళ్లాలన్నా ప్రయాస తప్పడం లేదు. రోడ్లకు నిధులు రాబట్టడంతోనే సరి అన్నట్లుగా ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. ఆతర్వాత పర్యవేక్షణ కొరవడడంతో అధికారులూ నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దారపర్తి గిరిజన పంచాయతీ పరిధిలో 11 ఆవాసాలు ఉన్నాయి. మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో 8 ఆవాసాలు ఉన్నాయి. శృంగవరపుకోట పంచాయతీ శివారులో రెండు గిరిజన ఆవాసాలు ఉన్నాయి. ఇవన్నీ కొండ శిఖరాన ఉండడంతో రోడ్డు సదుపాయం లేదు. దీంతో ఈ గ్రామాల గిరిజనులు విద్య, వైద్యానికి దూరమవుతున్నారు.

ఈ గ్రామల్లో చదువుకున్న కొంతమంది యువకులు రవాణా సదుపాయం కోసం దశాబ్దకాలంగా ఉద్యమిస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ దారపర్తి పంచాయతీ శివారు గ్రామం పల్లపు దుంగాడ వరకు రోడ్డు నిర్మాణానికి అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నిధులు రాబట్టారు. అటవీప్రాంతం కావడంతో ఆ శాఖ అనుమతులు ఇవ్వలేదు. భూమికి భూమి ఇచ్చేందుకు (మిగతా 8వ పేజీలో..)



- పుణ్యగిరి కొండ మెట్ల మార్గం వరకు ఉన్న జడ్పీ రోడ్డు నుంచి రేగపుణ్యగిరి వరకు 3.05 కి.మీ. రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉపాధిహామీ పథకం కింద రూ.400.00 లక్షలు కేటాయించారు. 2025 జనవరి 24న పనులు ప్రారంభించారు. 1.99 కి.మీ. మేర రోడ్డు స్థలం అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని అటవీశాఖ ఆధీనంలో ఉంది. అక్కడి అధికారుల నుంచి అనుమతులు లేకపోవడంతో రోడ్డుపనులు ఆగిపోయాయి.



- ఏప్రిల్ 30న వర్షంతో పాటు పిడుగులు పడ్డాయి. దారపర్తి పంచాయతీ శివారు పోర్లు గ్రామానికి చెందిన కిరణ్ అనే బాలుడు చనిపోయారు. ఈ కొండ శిఖర గ్రామానికి రోడ్డు లేదు. ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బాలుడి మృతదేహాన్ని గిరిజనులు కాలినడకన మోసుకెళ్లారు.

మహానాడుకు సన్నద్ధం

- 18 నుంచి అన్ని నియోజకవర్గాల్లో సభలు
- 23 లేదా 24న జిల్లా స్థాయి కార్యక్రమం
- తొలిదశ సంస్థాగత ఎన్నికలు పూర్తి
- రెండోదశ ప్రక్రియకు రంగం సిద్ధం



విజయనగరం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి(మే28)ని పురస్కరించుకుని ఏటా తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడుకు జిల్లాలోనూ ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రస్థాయిలో ఈ నెల 26 నుంచి రెండు రోజుల పాటు కడప జిల్లాలో సభలు జరుగుతాయి. ఈలోగా గ్రామ, వార్డు, డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే గ్రామ, వార్డు, డివిజన్ స్థాయి టీడీపీ ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ కమిటీలకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ కూడా దాదాపు పూర్తికావచ్చింది. ఇక రెండోదశ ఎన్నికల్లో భాగంగా నగరం, పట్టణం, మండలంలో టీడీపీ కమిటీలు, అనుబంధ సంఘాలకు సంబంధించి ఏకాభిప్రాయంతో నియామక ప్రక్రియను ఈ నెల 18లోగా పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించడానికి రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు పరిశీలకులు కూడా రానున్నారు. జిల్లాలో మండలాలు, నగర కమిటీ, నెల్లిమర్ల నగర పంచాయతీ కమిటీ, బొబ్బిలి పట్టణ కమిటీల ప్రక్రియ ఈ నెల 15లోగా పూర్తికానుంది. జిల్లా స్థాయి కమిటీల ప్రక్రియ ఈ నెల 15న ప్రారంభమై 17న ముగియనుంది.

18 నుంచి మినీ మహానాడులు

రాష్ట్ర మహానాడుకు ముందుగా జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 18 నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మినీమహానాడులు జరగనున్నాయి. విజయనగరం నియోజకవ ర్గానికి సంబంధించి ఈ నెల 20న మహానాడు జరగనుంది. ఈ మహానాడులో ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను చర్చించి దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను రాష్ట్ర మహానాడుకు నివేదించనున్నారు. కడప జిల్లాలో నిర్వహించే మహానాడుకు (మిగతా 8వ పేజీలో..)

మట్టి వ్యాపారం



తామరాపల్లి రెవెన్యూ పరిధిలోని భూముల్లో తవ్వేసిన మట్టి (ఫైల్)

- డి.పట్టా, జిరాయితీ భూముల్లో తవ్వకాలు
- కొండ పోరంబోకులోనూ విచ్చలవిడిగా..
- భారీ గుంతలతో స్థానికుల్లో ఆందోళన
- అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితమేదీ?

గంట్యాడ, మే 5(ఆంధ్రజ్యోతి):

- గింజేరు గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 99లో కొండను గుల్ల చేస్తున్నారు. మట్టిని తవ్వి విశాఖపట్నం నుంచి రాయపూర్ వరకు నిర్మిస్తున్న రోడ్డుకు తరలిస్తున్నారు. దీనికి ఎలాంటి అనుమలు లేవు. గ్రామ పంచాయతీ తీర్మానం కూడా లేదు. అయినా ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి భారీ వాహనాల్లో తరలించి సొమ్ము చేసుకున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గింజేరు గ్రామానికి చెందిన శిఖా వెంకటరావు గత సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టరు అంబేడ్కర్‌కు విన్నవించారు.
- కొండతామరాపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న డి.పట్టా, జిరాయితీ భూముల్లో భారీ యంత్రాలతో తవ్వి మట్టిని రహదారి నిర్మాణం కోసం వినియోగించారు. పైన ఉన్న కొండల నుంచి నీరు వచ్చే భూభాగంలో 15 నుంచి 20 అడుగుల లోతున ఇక్కడ మట్టిని తవ్వారు. ఈ భూముల్లో కాలువలతో పాటు చెక్‌డ్యామ్‌లు ఉన్నాయి. దీనివల్ల కింద ఉన్న చెరువుల్లోకి నీరు చేరడం కష్టంగా మారింది. ఆ భూముల వైపు పశువులను మేతకు తీసుకుని వెళ్లాలంటేనే భయం వేస్తోందని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మట్టి తవ్వకాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కొందరు కొండతామారాపల్లి గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు.



గింజేరు కొండపై భారీగా తవ్వకాలు

గంట్యాడ మండలంలోని చాలా గ్రామాల్లో అడ్డదిడ్డంగా తవ్వకాలు సాగుతున్నాయి. చివరకు (మిగతా 8వ పేజీలో..)

7

పైడిమాంబ దేవర ఉత్సవానికి చాటింపు

127 కిలోల గంజాయి స్వాధీనం

మినుములు కొనుగోలు చేయండి

ఘనంగా దాడితల్లి తొలేళ్ల పండగ

బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి దాడితల్లి పండగలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించనున్నారు. అలాగే దాడితల్లి అమ్మవారి పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో కూడా తొలేళ్ల ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గొల్లపల్లి, రంగరాయపురం, కృష్ణాపురం, పెంట, కొత్త పెంట, కారాడ తదితర 12 ఊళ్లకు దాడితల్లి గ్రామదేవతగా పూజలందుకుంటున్నారు.



8 లో

ఆ 70 ఎకరాలు మా భూములు

- ప్రభుత్వ భూమిగా మారిపోయాయి
- పనసలవలస రైతుల ఆందోళన



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన రైతులు

విజయనగరం కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రీసర్వే కారణంగా తమకు వారసత్వంగా వచ్చిన భూములు ప్రభుత్వ భూములుగా మారిపోయాయని రేగిడి మండలం పనసలవలస గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వెబ్‌ల్యాండ్‌లో (మిగతా 8వ పేజీలో..)

కబళించిన మృత్యువు

- వేర్వేరు ఘటనల్లో ఇద్దరు సజీవ దహనం
- లారీలో డ్రైవర్, ఇంట్లో వృద్ధురాలు మృతి

డెంకాడ/చీపురుపల్లి (గరివిడి), మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు సజీవదహనమయ్యారు. ఊహించని ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు జూట్ బ్యాగుల లోడుతో వెళ్తున్న లారీ టోల్‌గేట్ సమీపంలో ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టింది. దీంతో జూట్ బ్యాగుల లారీలో మంటలు చెలరేగి క్షణాల్లో లారీ అంతా విస్తరించాయి. డ్రైవర్ వసుదేవ్ సిక్దర్(43) క్యాబిన్‌లో చిక్కుకుని బయట పడలేక పోయాడు. హాహాకారాలు చేస్తూ మంటల్లోనే సజీవ దహనమయ్యాడు. డ్రైవర్‌ను కాపాడటానికి స్థానికులు ప్రయత్నించినప్పటికీ డోర్ తెరుచుకోకపోవడంతో సాధ్యం కాలేదు. డ్రైవర్‌ది పశ్చిమబెంగాల్ రాష్ట్రం. ప్రమాదంలో లారీ కూడా పూర్తిగా దగ్ధమైంది. భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు.

కోనూరులో వృద్ధురాలు

గరివిడి మండలం కోనూరులో సోమవారం తెల్లవారుజామున యడ్ల అసిరితల్లి (70) సజీవ దహనమైంది. ఇంట్లో ఉన్న గ్యాస్ బండ లీకైన విషయాన్ని ఆమె గుర్తించలేకపోయింది. స్టౌ వెలిగించడానికి ప్రయత్నించడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించి ఇల్లంతా మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కలవారు చేరే లోపల మంటలు తీవ్రమయ్యాయి. ఆమె బయటపడలేక పోయింది. పోలీసులు కేసు నమోదు చేశారు.



అసిరితల్లి(ఫైల్)



దాదాపు దగ్ధమైన లారీ.. మంటలను ఆర్పుతున్న పోలీసులు

ఉపాధి వేతనదారులకు ఊరట

- పెరిగిన రోజువారీ కూలి
- ఇకపై రూ.307

7

ఉపాధి వేతనదారులకు ఊరట

● పెరిగిన రోజువారీ కూలి

గజపతినగరం, మే5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం స్వల్ప ఊరట నిచ్చింది. వీరికి వేసవిలో ప్రత్యేక భత్యం ఇవ్వనందున ఆ లోటును భర్తీ చేసేందుకు దినసరి వేతనం పెంచింది. ఇప్పటివరకు రూ.300 ఇస్తుండగా ఇకపై రూ.307 చేసింది. ఈ పెంపును గతనెల నుంచి అమల్లోకి వస్తుందని సంబంధిత అధికారులు తెలిపారు. గజపతినగరం మండలంలోని 30 పంచాయతీల్లో 13,220 మందికి జాబ్‌కార్డులు జారీ చేసినట్టు అధికారులు తెలిపారు. ఉపాధి పనులు చేసేవారు 10,400 మంది ఉన్నారు. అయితే వీరిలో నగం మంది దూరప్రాంతాల్లో పనులకు వెళుతున్నారు. అలాంటి వారంతా ఉపాధి వేతనం పెంపు వల్ల తిరిగి పనుల్లో చేరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం రూ.247 నుంచి రూ.300 వరకు వేతనాలు చెల్లింపులు జరుగుతున్నాయి. మూడేళ్ల క్రితం ఫిబ్రవరి నుంచి జూన్ వరకు కూలీలకు 15 శాతం నుంచి 30 శాతం వరకు వేసవి భత్యం అదనంగా ఇచ్చేవారు. దీనికోసం పనుల కోసం తీసుకువెళ్లే పరికరాల కోసం, తాగునీరు, మజ్జిగకు సంబంధించి అదనపు భత్యం ఉండేది. ఇప్పుడు అలాంటి భత్యాలేవీ లేకుండా స్వల్పంగా వేతనం పెంచారు.

కొలతలు ప్రకారం పనులు

ఉపాధి పనులు గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇచ్చిన కొలతలు ప్రకారం వేతనం ఇవ్వడం జరుగుతుంది. వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. వేసవి దృష్ట్యా కూలీలు వడదెబ్బ కు గురవకుండా రెండు పూటలా పనులు కల్పిస్తున్నాం.

-కృష్ణవేణి, ఏపీవో, గజపతినగరం


మధుపాడలో పనులు చేపడుతున్న వేతనదారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉడా సబ్‌స్టేషన్ పరిధిలో బొగ్గుల దిబ్బ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఫీడర్ల నిర్వహణ నిమిత్తం మంగళవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉడా కాలనీ ఫేజ్-1, 2, ప్రభుత్వ సర్వజనాసు పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

●డెంకాడ: విద్యుత్ లైన్ల అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం మండలంలోని మోపాడ, జగన్నాథపురం, వల్లూరు, మోదవలస గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కార వేదికకు రెండు వినతులు

విజయనగరం రింగురోడ్డు, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు వినతులు అందాయి. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య వినతులు స్వీకరించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ టి.రాయల్‌బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రమణమూర్తి, మేనేజరు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం ఐటీఐలో ఉచిత శిక్షణ

రాజాం, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన నైపుణ్య కేంద్రంలో వెబ్ డెవలప్‌మెంట్ కంప్యూటర్ కోర్స్, సోలార్ పీవీ ఇన్‌స్టాలర్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 10 లోగా రాజాంలోని ప్రభుత్వ ఐటీఐను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7286042743, 8121450657లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఇనుప కంచె చోరీ

సంతకవిటి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కరాపలికి చెందిన తూలుగు రమణమూర్తికి చెందిన ఇనుప కంచె ఆదివారం రాత్రి చోరీకి గురైంది. రమణమూర్తి తన ఖాళీ స్థలంలో గత నెల 23న ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి కంచె చోరీకి విషయాన్ని సోమవారం గుర్తించిన ఆయన సంత కవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఆర్. గోపాలరావు కేసు నమోదు చేశారు.

జూట్ మిల్లులో ఉత్పత్తి ప్రారంభం

కొత్తవలస, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ సీతంపేటలో గల ధాన్య జూట్ మిల్లులో సోమవారం ఉత్పత్తి పూర్తిస్థాయిలో ప్రారంభమైంది. ఈ జూట్ మిల్లులో కార్మికులు, యాజమాన్యానికి మధ్య సమస్యలు పరిష్కారం కావడంతో యాజమాన్యం లాకౌట్ ఎత్తి వేసి, మిల్లులో ఉత్పత్తి ప్రారంభించింది. దీంతో మిల్లులో పనిచేస్తున్న 400 మంది కార్మికులకు రెండు షిఫ్టులలో యాజమాన్య పనులు కల్పిస్తోంది.

శ్మశానవాటిక ఎక్కడ?

జామి, మే 5 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా శ్మశానవాటిక లేకపోవడంతో జామి వాసులు అవస్థలకు గురవుతున్నారని మానవ హక్కుల జిల్లా ప్రతినిధి కొత్తలి గౌరినాయుడు అన్నారు. సోమవారం ఆయన జామిలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో శ్మశాన వాటిక స్థలాన్ని గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అధికారులు అప్పగించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. మండలకేంద్రంలో పదుల ఎకరాలు ప్రభుత్వ భూమి గత ప్రభుత్వంలో కొందరు ఆక్రమించుకుని అనుభవిస్తున్నారన్నారు. అయితే శ్మశానవాటికకు అధికారులు స్థలం సేకరించకపోవడం విడ్డూరమన్నారు. ఈ సమస్యను జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్తానని గౌరినాయుడు తెలిపారు.

అనాథ వృద్ధుల సేవకు ముందుకు రండి

కొత్తవలస, మే 5 (ఆంధ్రజ్యోతి): అనాథ వృద్ధులకు సేవ చేయడానికి ముందుకు రావాలని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణంరాజు అన్నారు. సోమవారం మండలంలోని తుమ్మికాపల్లి గేట్ వద్ద షర్డి పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంటరి అనాథ వృద్ధులకు బియ్యంతో పాటు నిత్యాసరాలను పంపిణీ చేశారు. చినరావుపల్లి సర్పంచ్ బూసాల దేముడు, బూసాల సన్యాశిరావు సహకారంతో నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ వి.హరికుమార్, రిటైర్డు రైల్వే ఉద్యోగి రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్ మే 5 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని కార్యాలయంలో సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సింహాచలంలోని వరహా నృసింహస్వామివారి చందనోత్సవ ప్రసాదం, చంద్రబాబు దంపతుల ఫొటోను సీఎంకు అందచేశారు.


సీఎంకు చిత్రపటాన్ని అందజేస్తున్న అదితి

పైడిమాంబ దేవర ఉత్సవానికి చాటింపు

విజయనగరం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సిరుల తల్లి పైడిమాంబ దేవర ఉత్సవానికి చాటింపు పక్రియ సోమవారం మూడు లాంతర్ల వద్ద గల చదురుగుడిలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ తలయారి రామవరపు చినపైడిరాజు ఆధ్వర్యంలో చాటింపు ప్రక్రియ జరిగింది. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది, పైడితల్లమ్మ భక్తులు పాల్గొన్నారు. అనంతరం కోట వద్ద కూడా చాటింపు చేపట్టారు.


ఆలయం వద్ద చాటింపు ఘట్టం

వైసీపీ హయాంలోనే 'యాక్సిస్ ఎనర్జీ' ఒప్పందం

రాజాం, మే 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలోనే యాక్సిస్ ఎనర్జీ వెంచర్‌తో ఒప్పందాలు జరిగాయని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంపై సొంత పత్రికలో అడ్డగోలు రాతలు అధినేత జగన్ రాయించారన్నారు. ఒప్పందం రద్దు చేసుకోవడానికి వీలులేకుండా ఆనాడే వైసీపీ ప్రభుత్వం మెలికలు పెట్టిన సంగతి దాచారన్నారు. యూనిట్ రూ.5.12 చొప్పున కొనడానికి వైసీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే, కూటమి ప్రభుత్వం దాన్ని రూ.4.60కి తగ్గించి కొంటున్న నిజం కూడా దాచిపెట్టారన్నారు. ఏపీఈఆర్‌సీ స్వతంత్ర ప్రతిపత్తిగల వ్యవస్థతో బలవంతంగా ఒప్పందం చేయించినట్టు అబద్ధాలు రాశారని కోండ్రు విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే కోరారు.


ఎమ్మెల్యే కోండ్రు

బొద్దాం-కొఠారిపురం రోడ్డుకు మోక్షం

● కోండ్రు చిత్రపటానికి పాలభిషేకం

రాజాం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాం-కొఠారిపురం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చొరవతో రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈనేపథ్యంలో సోమవారం మాజీ సర్పంచ్ భూషణనా యుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోండ్రు చిత్రపటానికి స్థానికులు పాలభిషేకం చేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణం చేపట్టడంతో కొఠారిపురం, నంద బలగ, లక్ష్మీపురం గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.


రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

రోషిణికి అండగా ఉంటా

శృంగవరపుకోట రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో 588 మార్కులు సాధించిన మండలంలోని కొట్టాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని తెరపల్లి రోషిణి ఉన్నత చదువులకు అండగా ఉంటానని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ అన్నారు. టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన సదరు విద్యార్థినిని సోమవారం ఆయన సత్కరించారు. రూ. 5 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఉన్నత చదువులకు అయ్యే ఖర్చులో తాను 50 శాతం భరిస్తామని హామీ ఇచ్చారు. వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, జామి మండల పార్టీ అధ్యక్షుడు లగుడు రవికుమార్, ఎస్.కోట మండల పార్టీ కార్యదర్శి రామసత్యం, నాయకులు గుమ్మడి భారతి, ఇప్పాక వెంకటత్రివేణి తదితరులున్నారు.


రోషిణిని సత్కరిస్తున్న కృష్ణ

గిరిజనవర్సిటీ పనుల పరిశీలన

దత్తిరాజేరు/మెంటాడ, మే 5(ఆంధ్రజ్యోతి): దత్తిరాజేరు, మెంటాడ మండలాల పరిధిల్లో మర్రివలస, కుంటినవలసల్లో జరుగుతున్న గిరిజన వర్సిటీ పనులను ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు సోమవారం పరిశీలించారు. పనుల పురోగతి పై అధికారులతో మాట్లాడారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల పనులు ఎంతవరకు వచ్చిందీ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు, దత్తిరాజేరు తహసీల్దార్ విజయభాస్కరరావు, మెంటాడ ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటరావు ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్

పీజీఆర్ఎస్‌లో 177 వినతులు

విజయనగరం కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 177 వినతులు అందాయి. వినతులను ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో కీర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీల స్వీకరించారు. వినతులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు.


వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

సమస్యలను పరిష్కరించండి: ఎస్పీ

విజయనగరం క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 32 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినతుల పూర్వపరాలను విచారణ చేపట్టి, చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారంలో జిల్లా పోలీసు కార్యాల యానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, సుధాకర్, ఎస్‌ఐ రాజేశ్ పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రాథమిక పాఠశాలలను కొనసాగించండి

విజయనగరం దాసన్న పేట, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 1 నుంచి 5 తరగతులను మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలగా కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలలో రెండు ఎస్జీటీ పోస్టులు ఉండేలా చూడాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, పీడీ పోస్టులు మంజూరు చేయాలన్నారు. 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండో సెక్షన్ ఇవ్వాలన్నారు. మాతృభాషా మాధ్యమాన్ని విద్యాహక్కు చట్టంలో పేర్కొన్న విధంగా కొనసాగించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బంకురు జోగినాయుడు, రవి, రమేష్, గురుమూర్తి, పి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

సంక్షేమ పథకాలపై అవగాహన

గజపతినగరం, మే5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై భవన నిర్మాణ కార్మికులు అవగాహన పెంపొందించుకోవాలని న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎల్.రాంబాబు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి జి.ఎస్.ఎస్.కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు బతుకు తెరువు కోసం వివిధ గ్రామాల్లో పనులు చేపడుతుంటారన్నారు. అందుకు బీమాకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయాధికారి

శేషగిరి రచనలు సమాజానికి అవసరం

విజయనగరం దాసన్నపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): దివంగత ఉపాధ్యాయుడు కొరెడ్ల శేషగిరి రచనలు సమాజానికి ఎంతో అవసరమని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో శేషగిరి నాలుగో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శేషగిరి రాసిన వ్యాసాలు తరుగులేని కీర్తిసిరి పుస్తకంతో పాటు డీఎస్సీ పరీక్షల మెటీరియల్‌ను ఆయన శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేషగిరి మంచి నాయకుడని కొనియాడారు. ఆయన ఆలోచనలు, భావజాలం ముందుకు తీసుకువెళ్లాలని వారి అభిమానులను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎం.కృష్ణమూర్తి, యూటీఎఫ్ ప్రతినిధులు మోహనరావు, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, రాజ్‌గోపాల్, కొరెడ్ల విజయగౌరి, శ్రీనివాసరావు, రాము, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్మన్

పశువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టండి: ఆర్డీవో

చీపురుపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణాపై అధికారులు నిఘా పెట్టాలని చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి జంతు సంక్షేమ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. దేవాలయాలకు 300 మీటర్ల దూరంలో జంతు బలులు జరగకుండా చూడాలన్నారు. బలులను నిషేధిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆమె, డీఎస్పీ ఎస్.రాఘవులుతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, పశు సంవర్థక శాఖ డీడీ దామోదరరావు, చీపురుపల్లి ఏడీ డా.శారద, రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, చీపురుపల్లి సీఐ జి.శంకరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.


వాల్ పోస్టరు విడుదల చేస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భోగాపురం, మే5 (ఆంధ్రజ్యోతి): భోగాపురం సచివాలయం-2 సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం అదే గ్రామానికి చెందిన దుబ్బక సంతోష్ (37)ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దాంతో అక్కడికక్కడే యువకుడు మృతి చెందారు. భోగాపురం పెద్ద వీధిలో నివాసం ఉంటున్న సంతోష్.. సచివాలయం-2 సమీపంలోని కల్లానికి నిత్యం వెళ్తుంటాడు. సోమవారం వేకువ జామున విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే రహదారిలో నడుచుకుని వెళ్తుండగా అతడిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విగతజీవిగా పడి ఉన్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు దుబ్బక ఈశ్వరమ్మ, అప్పన్న, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈశ్వరమ్మ, అప్పన్నలకు ఇద్దరు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్న కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. ఘటనా స్థలాన్ని సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్‌ఐ సూర్య కుమారి పరిశీలించారు. మృతుడి తండ్రి అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు..

సీతానగరం, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భల్లకృష్ణరాయపురంలో సోమవారం ఉదయం బొత్స రమణమ్మ(75) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు తెలిపిన వివరాల ప్రకారం.. రమణమ్మ తన కుమార్తె లక్ష్మితో కలిసి ఇంట్లో నివాసం ఉంటోంది. అయితే ఆదివారం లక్ష్మి వేరేవారి ఇంటికి నిద్రించడానికి వెళ్లింది. రమణమ్మ ఆ రోజు ఒంటరిగానే ఇంట్లో నిద్రించింది. సోమవారం ఉదయం లక్ష్మి తన ఇంటికి వచ్చి తల్లి రమణమ్మను నిద్రలేపగా.. ఆమె మృతిచెంది ఉంది. దీంతో లక్ష్మి బోరున ఏడ్చింది. బీరువాలో బంగారు ఆభరణాలు, డబ్బులు మాయమైనట్టు గుర్తించింది. దీంతో తన ఇంట్లో దుండగులు చొరబడి బంగారు ఆభరణాలు, డబ్బులు దొంగిలించి, తన తల్లిని హత్య చేసి ఉంటారని అనుమానంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎస్‌ఐ నీలకంఠం, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. రమణమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం కేంద్రా సుపత్రికి తరలించారు. సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.


రమణమ్మ (ఫైల్)

127 కిలోల గంజాయి స్వాధీనం

● నిందితులు పరారీ

పాచిపెంట, మే 5 (ఆంధ్రజ్యోతి): కారులో రవాణా చేస్తున్న 127 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సాలూరు రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు పాచిపెంట మండలంలోని పద్మాపురం జంక్షన్ వద్ద ఎస్‌ఐ కె.వెంకటసురేష్ తన సిబ్బందితో సోమవారం దాడి చేసి కారును పట్టుకున్నారని తెలిపారు. కారులో ఉన్న 127 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారని చెప్పారు. అయితే నిందితులు పరారయ్యారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

మెంటాడలో 30 మద్యం సీసాలు..

●మెంటాడ, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతుగెడ్డ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి సోమవారం 30 మద్యం సీసాలను ఆంద్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తి మెంటాడ నుంచి బస్సులో మద్యం సీసాలు తరలిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేశారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతడిపై ఆంద్ర ఎస్‌ఐ సీతారాం కేసు నమోదు చేశారు.

చీటింగ్ కేసులో వ్యక్తి అరెస్టు

విజయనగరం క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేట్ బ్యాంకును మోసగించి రుణం తీసుకున్న కేసులో గుర్ల మండలం గిరడ గ్రామానికి చెందిన బాలచంద్రరావును సోమవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలచంద్రరావు భూమి విలువ ఎక్కువ చూపించి, బ్యాంకులో రూ.34 లక్షల రుణం తీసుకుని మోసగించారన్నారు. అలాగే తక్కువ విలువ కలిగిన భూమిని ఎక్కువగా చూపించి మరో రూ.14 లక్షలు తీసుకుని మోసానికి పాల్పడినట్టు బ్యాంకు ప్రతినిధులు ఫిర్యాదు చేశారన్నారు. దాంతో బాలచంద్రరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వన్‌టౌన్ సీఐ తెలిపారు.

మినుములు కొనుగోలు చేయండి


●కలెక్టరేట్ ఎదుట రైతుల నిరసన

విజయనగరం కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): పంటను కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన బాటపట్టారు. మండుటెండలో కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించారు. జిల్లాలో పెసలు, మినుములు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని మండిపడ్డారు. సోమవారం కలెక్టరేట్ వద్ద మినులు బస్తాలతో రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ మార్చి 18న గంట్యాడలోని రైతు సేవ కేంద్రంలో, జామి మండలంలో విసినిగిరిలో మినులు, పెసలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే ఇప్పటి వరకూ ఒక్క గింజా కొనుగోలు చేయలేదన్నారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన సమయంలో బస్తా రూ.7400 ఉండగా ఇప్పుడు రూ.5400కు పడిపోయిందన్నారు. దీంతో రైతులు వద్ద మినుములు నిల్వ ఉన్నాయన్నారు. మినుములు కొనుగోలుకు జిల్లా అధికారులు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో వ్యవసాయ శాఖ జేడీ వి.టి.రామారావు, మార్క్‌ఫెడ్ డీఎం వెంకటేశ్వరరావు రైతులతో మాట్లాడారు. మంగళవారం నుంచి మినుములు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు రాంబాబు, ఆదినారాయణ ఉన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

అనుమతులు లేని నిర్మాణాల కూల్చివేత

విజయనగరం రింగురోడ్డు, మే 5 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ఎన్‌సీఎస్ రోడ్డులోని నిర్మాణాన్ని ప్రణాళిక సిబ్బంది తొలగించారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా దుకాణ సముదాయాన్ని నిర్మించడంపై అందిన ఫిర్యాదు నేపథ్యంలో నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం అధికారులు నిర్మాణాలు తొలగింపునకు నోటీసులు జారీ చేశారు. అయితే నిర్మాణదారులు కోర్టును ఆశ్రయించారు. తుదకు హైకోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కమిషనర్ నల్లనయ్య స్పందించి తక్షణమే సదరు కట్టడాన్ని తొలగించాలని ఆదేశించారు. దాంతో దుకాణ సముదాయాన్ని సిబ్బంది కూల్చివేశారు.


అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం/ నెల్లిమర్ల, మే5(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండలం సతివాడలో రామాలయం నిర్మాణానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు రూ.50 వేల విరాళం అందజేశారు. సోమవారం మండలంలోని పోలిపల్లిలో గల నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు ఆ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోరాడ శ్రీను, రెల్లి వెంకటేశ్ పాల్గొన్నారు.

నిధుల విడుదలపై హర్షం

లక్కవరపుకోట, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్యాడ తలారి నుంచి దాసుల్లపాలెం మీదుగా గోల్డ్‌స్టార్ కూడలి వరకు 3.14 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు మోక్షం కలిగింది. స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చొరవతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.80 కోట్లను కేటాయించాయి. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు పనులు చేపట్టేందుకు పీఆర్ డిపార్ట్‌మెంట్ సన్నద్ధమవుతోంది. ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు సమస్యపై జనవరి 20న 'ఆంధ్రజ్యోతి'లో 'ఇది మట్టిరోడ్డు కాదు తారురోడ్డే' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. అందుకు తగ్గట్టు నిధుల మంజూరుకు ఆమె కృషి చేశారు.

రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోండి



పౌష్టికాహారం అందజేస్తున్న చిన్నయిదేవి

బొండపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు రక్తహీనత సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ పి.చిన్మయిదేవి సూచించారు. మండలంలోని వేంద్రాం లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లలు వివరాలతో పాటు కేంద్రం లోని స్టాకు వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పీవో ఉమాభారతి, సూపర్‌వైజర్ జానకి పాల్గొన్నారు.

ఐవీఆర్‌ఎస్‌పై పునరాలోచించాలి

సంతకవిటి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఐవీఆర్‌ఎస్ విధానంపై ప్రభుత్వం పునరాలోచిం చాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల డెమొక్రెటిక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుగుబెల్లి కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం సంతకవిటిలో ఆయన మీడియాతో మాట్లాడారు. లబ్ధిదారులకే నేరుగా ఫోన్ కాల్స్ ద్వారా పథకం ప్రయోజనం, సచివాలయ సిబ్బంది సేవల్లో నాణ్యతలను ఫీడ్ బ్యాక్‌లను సేకరిస్తోందన్నారు. అయితే చాలా మంది వృద్ధులకు, వికలాంగులకు తెలియక పోవడం వల్ల తప్పుడు ఫిర్యాదులు వెళ్తున్నాయన్నారు. దాంతో సచివాలయ సిబ్బంది దోషిలా మారుతున్నారన్నారు. తక్షణమే ఈ విధానం పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన కోరారు.

కిశోర వికాసంపై అవగాహన

లక్కవరపుకోట, మే 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఏసీడీపీవో బి.లక్ష్మీబాయ్ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌లు, వీవోఏలతో సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలికల వికాసంపై ప్రతీ గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. వారి ఆరోగ్యం, ఆర్థిక ఆవశ్యకత, సైబర్ క్రైమ్, రుతుక్రమ పరిశుభ్రత, బాల్య వివాహాలు వంటి వాటిపై అవగాహన తప్పనిసరని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించేదెప్పుడు?

కొత్తవలస, మే 5 (ఆంధ్రజ్యోతి): చిన్నిపాలెంలో భూ సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారో చెప్పాలని స్థానికులు అధికారులను ప్రశ్నించారు. సోమవారం చిన్నిపాలెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాధితులు మాట్లాడారు. రెవెన్యూ సదస్సులకు హాజరైన అధికారులను అడిగితే త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పి వెళ్లారన్నారు. కాళ్లరిగేలా మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. సమస్య పరిష్కరిస్తాం రమ్మని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడం, కార్యాలయానికి వెళ్లిన తర్వాత వాయిదా వేయడం సాధారణమైపోయిందన్నారు. భూ సమస్య ఎప్పుడు పరిష్కరిస్తారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టిలో పెట్టండి

శృంగవరపుకోట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు కోరారు. సోమవారం శృంగవరపుకోట తహసీల్దార్ ఎం.అరుణకుమారిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక డిపో కార్యదర్శి ఎ.రాజయ్య తదితరులున్నారు.

విద్యార్థులను నాయకులుగా తీర్చిదిద్దాలి

డెంకాడ, మే 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను నాయకులుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా అధ్యాపకులు కృషి చేయాలని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమేశ్ సూచించారు. కళాశాలలో సోమవారం అధ్యాపకుల రక్షణ ఆధారిత నాయకత్వ శిక్షణ ప్రారంభమైంది. ఐదురోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఇండియన్ కోస్ట్ గార్డ్ రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ దేవానంద్ జి.పిళ్లై, భారత నావికాదళం ఎస్ఎన్‌బీ మాజీ అధ్యక్షుడు కమోడోర్ మనోజ్ బురారియాతో కలిసి ప్రిన్సిపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసీ శేఖర్, డీన్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

త్వరితగతిన పరిశ్రమలకు అనుమతులు

విజయనగరం కలెక్టరేట్ మే 5 (ఆంధ్రజ్యోతి) పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తులను పరిశీలించి నిర్ణీతవ్యవధిలోగా అనుమతులు మంజూరు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల్లో పరిశ్రమల స్థాపనకు 149 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో ఇప్పటి వరకూ 138 అనుమతులు మంజూరు చేశామన్నారు.విశ్వకర్మ యోజనకు 86,386 దరఖాస్తులు రాగ, వీటిలో 1080 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో పరిశ్రమలు మేనేజరు శ్రీధర్, సహాయ సంచాలకుడు రామకృష్ణ ఉన్నారు.

కొనసాగుతున్న సీహెచ్‌వోల నిరసన

విజయనగరం కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన దీక్ష ఐదోరోజు సోమవారం కూడా కొనసాగింది. తమను రెగ్యులర్ చేయాలని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే వరకూ నిరసన కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

ఘనంగా దాడితల్లి పండగ

- ఉత్సాహంగా తోలేళ్లు
- నేడు సిరిమానోత్సవానికి ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఘటాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బొబ్బిలి/ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి దాడితల్లి పండగలో భాగంగా సోమవారం ఘనంగా తోలేళ్ల



కృష్ణాపురంలో తోలేళ్ల ఉత్సవం

ఉత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించున్నారు. అలాగే దాడితల్లి అమ్మవారి పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో కూడా తోలేళ్ల ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గొల్లపల్లి, రంగరాయపురం, కృష్ణాపురం, పెంట, కొత్త పెంట, కారాడ తదితర 12 ఊళ్లకు దాడితల్లి గ్రామదేవతగా పూజలందుకుంటున్నారు.

పోలీసు సిబ్బందితో సమీక్ష

దాడితల్లి సిరిమానోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక కళాభారతి ఆడిటోరియంలో డీఎస్పీ భవ్యరెడ్డి పోలీసు సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రూట్ మ్యాప్ విడుదల చేశారు. ఎవరెవరు ఎక్కడ విధులు నిర్వహించాలనే అంశంపై సిబ్బందికి సూచనలు చేశారు. క్రమశిక్షణతో ఓపికతో, ఒత్తిడి లేకుండా పనిచేయాలని సూచించారు. సీఐ సతీష్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్ఠ బందోబస్తు: ఎస్పీ



ఆలయం వద్ద ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బొబ్బిలి/రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం ఆయన బొబ్బిలిలో పర్యటించారు. సిరిమానోత్సవం బందోబస్తు ఏర్పాట్లపై డీఎస్పీ భవ్యరెడ్డి, సీఐ సతీష్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. రోడ్ మ్యాప్‌ను పరిశీలించి, ట్రాఫిక్ నియంత్రణపై తీసుకున్న చర్యలపై ప్రశ్నించారు. అనంతరం గొల్లపల్లిలోని అమ్మవారి ఆలయం, సిరిమాను వెళ్లే రహదారిని ఆయన పరిశీలించారు. ఆలయ నిర్వాహకుడు, మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

- బొబ్బిలి ఏఎంసీ జంక్షన్ నుంచి కృష్ణాపురం మీదుగా వాహనాలను మళ్లిస్తామని, అదే విధంగా రాజాం, తెర్లాం నుంచి బొబ్బిలి వైపు వచ్చే వాహనాలను పిరిడి జంక్షన్ నుంచి కృష్ణాపురం, ఏఎంసీ జంక్షన్ మీదుగా బొబ్బిలి పట్టణానికి అనుమతిస్తామని ఎస్పీ తెలిపారు.

300 మందితో బందోబస్తు..

దాడితల్లి సిరిమానోత్సవానికి 300 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. 90 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లతో నిఘాను ఏర్పాటు చేశామని వివరించారు.

నిధులున్నాయి.. రోడ్లే లేవు!

(ఐదో పేజీ తరువాయి)

ఒప్పందం కుదిరింది. ఈ ప్రక్రియ జరుగుతుండగానే ప్రభుత్వం మారిపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వ ప్రజాప్రతినిధులపై గిరిజనులు ఒత్తిడి తేవడంతో పనులు ప్రారంభించారు. అటవీశాఖకు ఇవ్వాల్సిన స్థలం అప్పగించక పోవడంతో అడ్డంకులు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల అటవీశాఖకు రెవెన్యూ అధికారులు భూమిని అప్పగించినా పనులు సాగడం లేదు. ఇప్పటికీ అటవీశాఖ అభ్యంతరాలు ఉన్నాయంటూ అధికారులు తప్పించుకుంటున్నారు. రోడ్డు నిర్మాణానికి పునాది పడలేదు. ఎస్.కోట పంచాయతీ శివారు రేగ పుణ్యగిరి గిరిశిఖర గ్రామానికి రోడ్డు నిర్మించేందుకు నిధులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంబేద్కర్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోరారు. దీంతో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. గిరిజనులకు రోడ్డు అవసరాన్ని గుర్తించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నిధులు కేటాయించారు. దగ్గరుండి రోడ్డు పనులు చేపట్టారు. అటవీశాఖ అధికారుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన భూభాగం కావడంతో అక్కడి కలెక్టర్‌కు సమస్యను వివరించారు. అయినా పనులు జరగ డం లేదు. ఈ మండల పరిధిలోని గిరిజన గ్రామాలన్నీ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలానికి ఆనుకుని ఉన్నాయి. దీంతో ఈ గ్రామాల రోడ్ల నిర్మాణానికి ఈ జిల్లాకు చెందిన అటవీశాఖ భూభాగం తప్పనిసరి. ఈ విషయం అధికారులకు తెలుసు. రోడ్డు నిర్మాణం ప్రారంభించినప్పుడే అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారుల ద్వారా అటవీశాఖ అనుమతులు పొందేలా చర్యలు తీసుకుని ఉంటే ఈపాటికి పూర్తయ్యేవి.

ఆరు నెలలు గడుస్తున్నా..

వైసీపీ హయాంలో మూలబొడ్డవర పంచాయతీ శివారు చిట్టంపాడు గ్రామానికి చెందిన బాలుడు విశాఖలో మరణించాడు. మృతదేహాన్ని తరలించేందుకు వాహనాన్ని సమకూర్చలేదు. రవాణా సదుపాయం ఉన్నవరకు ఏదోలా తీసుకుని వచ్చిన బంధువులు గ్రామానికి భుజంపై ఎత్తుకుని వెళ్లారు. అప్పట్లో ఈ ఘటన సంచలనమైంది. ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కొండ ఎక్కారు. తాము అధికారంలోకి వస్తే రోడ్డును నిర్మిస్తామని మాట ఇచ్చారు. అధికారంలోకి రాగానే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. అయితే ఆరు నెలలు గడుస్తున్నా ఆ నిధులు కాగితాల్లోనే ఉన్నాయి.

అటవీశాఖ అభ్యంతరాలు..

దబ్బగుంట నుంచి వల్లపు దుంగాడ, పుణ్యగిరి జడ్పీ రోడ్డు నుంచి రేగ పుణ్యగిరి రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అభ్యంతరాలు ఉన్నాయి. జిల్లా స్థాయిలో అధికారులు చర్చలు జరుపుతున్నారు. లిఖిత పూర్వకంగా ఆదేశాలు రావాల్సి ఉంది. చిట్టంపాడు రోడ్డు నిర్మాణం టెండర్ ప్రక్రియ పూర్తయింది.

- ఐశ్వర్య, సహాయ కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్‌శాఖ, కొత్తవలస

మట్టి వ్యాపారం

(ఐదో పేజీ తరువాయి)

చెరువుల్లో మట్టిని కూడా వదల్లేదు. చెరువు లోతు చేయడం కోసం రైతుల నుంచి సంతకాలు తీసుకుని.. కొంతమంది వ్యక్తులు ఇష్టారాజ్యంగా తవ్వి మట్టిని తీసుకు వెళ్తున్నారు. గింజేరు గ్రామ పరిధిలో 22 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొండ పోరంబోకులో రెవెన్యూ అధికారులు రెండున్నర ఎకరాలకు అనుమతి ఇవ్వగా పది ఎకరాల వరకు తవ్వేశారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడింది. పైగా ఆ గ్రామం సాగునీటి వనరులకే ముప్పు ఏర్పడింది. కొండతామరాపల్లి గ్రామ పరిధిలో డి.పట్టా, జిరాయితీ భూముల్లోనూ ఇంతే. ఎక్కడ చూసినా భారీ గుంతలు కనిపిస్తున్నాయి. ఇక్కడ తవ్వకాల వల్ల నీరు చెరువులకు చేరడం లేదని, తమ పొలాలకు ఇబ్బందిగా ఉందని రైతులు చెబుతున్నారు. జిరాయితీ, సొంత భూముల్లో మట్టి తవ్వాలంటే ముందుగా భూగర్భగనుల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. అనుమతి తీసుకున్నా రెండు నుంచి మూడు అడుగులు మాత్రమే లోతు తవ్వాల్సి ఉంది. కానీ అక్రమార్కులు ఇవేవీ పట్టించు కోవడం లేదు. ఇంతజరుగుతున్నా స్థానిక అధికారులు కూడా చోద్యం చూస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు ఉండడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

మహానాడుకు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

సన్నద్ధతగా నియోజకవర్గాల్లో మహానాడులు జరుగుతాయి. ఇవి ముగిసిన అనంతరం జిల్లా స్థాయిలో మహానాడు జరగనుంది. ఈ నెల 23న కాని, 24న కాని జిల్లా మహానాడు ఉంటుంది. దీనికి ముందే పార్టీ జిల్లా అధ్యక్షుడ్ని రాష్ట్ర పార్టీ నియమిస్తుంది. కొత్త అధ్యక్షుని హయాంలో జిల్లాస్థాయి మహానాడు జరగనుంది. ప్రస్తుతం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కిమిడి నాగార్జున ఉన్నారు. ఆయనను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమించారు. తిరిగి పార్టీ పగ్గాలు ఆయనకు అప్పగిస్తారా? లేదంటే మరొకరికి అప్పగించనున్నారా? అన్నది కొద్ది రోజుల్లో తేలనుంది.

బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు

బాడంగి/ తెర్లాం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన వారి కుటుంబీకులకు ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు సోమవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. తెర్లాం మండలం అంటవారకు చెందిన కోట రామారావు అనే రైతు ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందాడు. అలాగే బాడంగి మండలం గజరాయునివలస గ్రామానికి చెందిన నల్ల అప్పలనాయుడు కూడా పొలంలో విద్యుదాఘాతంతో మృతిచెందాడు. దీంతో ఎమ్మెల్యే బేబీనాయన స్పందించి సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, విద్యుత్ సంస్థ నుంచి పరిహారం వచ్చేలా కృషి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన బుడా చైర్మన్‌తో కలిసి ఇరు కుటుంబాల ఇళ్లకు వెళ్లి రూ.5లక్షలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాడంగి అధ్యక్షుడు తెంటు రవి, పార్టీ తెర్లాం అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు, పార్టీ నాయకులు పాలవలస గౌరు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు..

బాడంగి: బాడంగి మండల కేంద్రంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో మరడాన చంద్రినాయుడు, సింహాచలం, శ్రీను, అంబటి తవిటినాయుడు, గొట్టాపు గోపాలంలకు చెందిన గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. ఈమేరకు వారికి బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన రూ.30వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని బాడంగి సర్పంచ్ కండి రమేష్, ఉప సర్పంచ్ మరడాన గాంధీ, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు సమక్షంలో బాధితులకు అందజేశారు.

పండగ నిర్వాహకులకు విరాళం

బొబ్బిలి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): దాడితల్లి అమ్మవారి పండగ నిర్వాహణకు గాను జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి డా.గిరడ అప్పలస్వామి, పార్టీ నాయకుడు పెద్దింటి మనోజ్ కుమార్ రూ.60వేలు విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆలయ కమిటీ పెద్దలకు అందజేశారు. జనసైనికుడు పైల హరిప్రసాద్ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



పీహెచ్‌సీ అధికారికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

బొబ్బిలి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరుగనున్న దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటామని మండలంలోని ఆశా కార్యకర్తలు సోమవారం పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రఘువంశికి నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, ఆశా కార్యకర్తల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆ 70 ఎకరాలు మా భూములు

(ఐదో పేజీ తరువాయి)

వన్‌బీలు మంజూరు కాక బ్యాంకుల్లో పంట రుణాలు రెన్యువల్ చేసుకోలేకపోతున్నామని వాపోయారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు వచ్చి వారు ఇన్‌చార్జి కలెక్టర్ సేతు మాధవన్‌కు తమ సమస్య విన్నవించుకున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామపరిధిలో గత 90 సంవత్సరాలుగా 140 మంది రైతులు 70 ఎకరాలను సాగు చేసుకుంటున్నారు. ఈ భూములకు పట్టాదారుపాసు పుస్తకాలు కూడా ఉన్నాయి. వన్‌బీలు మంజూరు కావడంతో బ్యాంకుల నుంచి రుణాలు కూడా తీసుకున్నారు. ఈ భూములు సాగు చేసుకుంటూ వారు జీవనం సాగిస్తున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం రీసర్వే చేయడంతో తమ భూములు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూములుగా మారిపోయాయని ఆ రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. అత్యవసర పరిస్థితుల్లో తమ భూములను విక్రయించుకోలేకపోతున్నామని, ఈ సమస్యను మండల రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని వారు కోరారు.

షేడ్‌నెట్‌ను వినియోగించుకోండి

బాడంగి, మే 5(ఆంధ్రజ్యోతి): కూరగాయల రైతులు రాయితీపై వచ్చే షేడ్‌నెట్‌ను వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం ఎ.రత్నకుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో కూరగాయల రైతులకు, వెలుగు వీవోఏలకు షేడ్‌నెట్‌లో కూరగాయల పెంపకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామభద్రపురం ఉద్యానవన శాఖాధికారి పి.మోహన్‌కృష్ణ పాల్గొని, మాట్లాడారు. రాయితీపై షేడ్‌నెట్ పొందాలనుకున్న రైతులు రైతుసేవా కేంద్రం సిబ్బంది ద్వారా మట్టి, నీటి నమూనాలను అందజేసి, పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సంవత్సరం పొడవునా నీటి లభ్యత ఉన్న కూరగాయల రైతులు ఈ షేడ్‌నెడ్‌ను వినియోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ ఆసక్తి గల ఎంపికైన రైతులకు వెలుగు ద్వారా రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముగడ, కోడూరు, పింద్రంగివలస, గొల్లాది, ఆకులకట్ట రైతులు, వెలుగు వీవోఏలు పాల్గొన్నారు.

బొబ్బిలిలో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

బొబ్బిలి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను బొబ్బిలిలోని స్థానిక సంస్థానం ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ పోటీలను మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు సౌజన్యంతో హెచ్‌ఎం సునీత, పీఈటీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ పోటీల్లో 25 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో బి.ధనుంజయ్, తుమ్మ సత్యనారాయణ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా, జూనియర్ విభాగంలో బి.హర్ష, బి.అభినయ్ కార్తిక్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం

రామభద్రపురం, మే 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసు క్వార్టర్స్‌కు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. 2002లో ఈ పోలీసు క్వార్టర్స్‌కు ఎకరా 28 సెంట్లు భూమి కేటాయించారు. అయితే ఈ స్థలంలో అప్పటి నుంచి ఎటువంటి నిర్మాణాలు జరగకపోవడంతో మళ్లీ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేయించారు. ఈ సర్వేలో కొంత స్థలం ఆక్రమణకు గురైనట్లు సర్వేయర్లు గుర్తించారు. దీనిపై రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్థలంలో ఆక్రమణలు తొలగించడానికి చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఆర్.అప్పారావు పాల్గొన్నారు.

అమ్మవారి నగల తనిఖీ

రాజాం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని నవదుర్గ అమ్మవారి దేవస్థానంలోని నవదుర్గ, జ్ఞానసరస్వతి అమ్మవార్లకు చెందిన నగలు, రికార్డులను దేవదాయశాఖ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. తనిఖీ అధికారి వీర పల్లంరాజు ఆధ్వర్యంలో అప్రైజర్ బంగారు ఆభరణాల బరువును రికార్డుల ప్రకారం తూకం వేశారు. నగలు నాణ్యతను పరిశీలించి, రికార్డుల ప్రకారం ఉన్నట్లు నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్యామలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నాయకుల నిరసన

బొబ్బిలి రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏపీటీఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. దశాబ్దాలుగా అమలవుతున్న ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు కేవలం 1, 2 తరగతులతో వేల సంఖ్యలో ఫౌండేషన్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని.. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగు తుందన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు.

